యూపీహెచ్‌సీకి వాటర్ పంప్‌సెట్ వితరణ



పంప్‌సెట్‌ను అందజేస్తున్న డాక్టర్ హిప్నో పద్మాకమలాకర్ తదితరులు

ముషీరాబాద్: ప్రపంచ ఎన్‌జీఓ డేను పురస్కరించుకుని డాక్టర్ హిప్నో కమలాకర్స్ మైండ్ అండ్ పర్సనాలటీ కేర్, నవభారత లయన్స్ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో ముషీరాబాద్ ప్రభుత్వ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వాటర్ పంప్‌సెట్‌ను అందజేశారు. ఈ కార్యక్రమంలో హ్యూమన్‌రైట్స్ కౌన్సిల్ జాతీయ చైర్మన్ విజయ్ కుమార్, డాక్టర్ హిప్నో పద్మాకమలాకర్, సతీష్, మనోజ్, ఆసుపత్రి వైద్యాధికారి డాక్టర్ మనోజ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మట్టికుప్పల తొలగింపు



సుందరయ్యవిజ్ఞానకేంద్రం: రాంనగర్ డివిజన్‌లోని నెహ్రూనగర్‌లో కొంతకాలంగా పేరుకుపోయిన మట్టికుప్పలను తొలగించాలని స్థానికులు ఎమ్మెల్యే ముఠాగోపాల్ కోరారు. ఈ మేరకు ఆయన గురువారం జీహెచ్‌ఎంసీ అధికారులతో మాట్లాడి మట్టి కుప్పలను తొలగించారు. సమస్య పరిష్కారం కావడంతో బస్తీవాసులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు ముఠా జైసింహ, శంకర్‌ముదిరాజ్, కళ్యాణ్‌నాయక్, ప్రేమ్‌కుమార్ ముదిరాజ్, రాజు, సందీప్, చైతన్య, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

బడ్జెట్‌లో విద్యకు 15శాతం నిధులు కేటాయించాలి

అడ్డగుట్ట: రాష్ట్ర బడ్జెట్‌లో విద్యకు 15 శాతం నిధులు కేటాయించాలని తెలంగాణ తల్లుల సంఘం రాష్ట్ర కన్వీనర్ భాగ్యలక్ష్మి డిమాండ్ చేశారు. అడ్డగుట్టలోని బాబు జగ్జీవన్‌రామ్ భవనంలో గురువారం సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా భాగ్యలక్ష్మి మాట్లాడుతూ.. గత పది సంవత్సరాలలో విద్యకు రాష్ట్ర బడ్జెట్‌లో కేవలం 6.6 శాతం మాత్రమే కేటాయించారన్నారు. ప్రస్తుత ప్రభుత్వం 15 శాతం బడ్జెట్‌ను కేటాయిస్తామని హామీ ఇచ్చినప్పటికీ తొలి బడ్జెట్‌లో కేవలం 7.6 శాతం మాత్రమే కేటాయించిందని తెలిపారు. తక్కువ నిధుల కేటాయింపు కారణంగా విద్యా ప్రమాణాలు మరింత దిగజారుతున్నాయన్నారు. కార్యక్రమంలో నాయకులు లక్ష్మీనారాయణ, రమా, జమునా, శోభ, పుష్ప పాల్గొన్నారు.

రాష్ట్ర వర్సిటీలలో ప్రవేశ నిబంధనలు మార్చండి

ఉస్మానియా యూనివర్సిటీ: తెలంగాణలోని వివిధ వర్సిటీలలో ప్రవేశ నిబంధనలలో మార్పు చేయాలని తెలంగాణ విద్యార్థి పరిషత్ (టీజీవీపీ) రాష్ట్ర అధ్యక్షులు నక్క శ్రీశైలం యాదవ్ గురువారం డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు అనంతరం హైదరాబాద్ ఉమ్మడి రాజధానిగా కొనసాగుతూ వర్సిటీల ప్రవేశాలకు 15 శాతం (ఓపెన్ టు ఆల్) సీట్లలో ఆంధ్రప్రదేశ్ విద్యార్థులు కూడ అడ్మిషన్లు పొందారని పేర్కొన్నారు. గత ఏడాది జూన్ నాటికి పదేళ్లు ముగిసినా ఇంత వరకు ప్రభుత్వం కొత్త నిబంధనలు రూపొందించనందున పాత పద్ధతిలోనే ప్రవేశాలు జరుగుతున్నాయన్నారు. ఏపీలో కొత్త నిబంధనలతో ప్రవేశాలు జరుగుతుండగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మాత్రం పాత పద్ధతిని కొనసాగించడం వలన విద్యార్థులు నష్టపోతున్నారని పేర్కొన్నారు.

బీసీ మహిళలకు చట్ట సభల్లో రిజర్వేషన్లు కల్పించాలి

కాచిగూడ: మహిళా బిల్లులో బీసీ మహిళలకు సబ్ కోటా కల్పించాలని, చట్ట సభల్లో మహిళలకు కేటాయించనున్న 33 శాతం సీట్లలో బీసీ మహిళలకు రిజర్వేషన్లు కల్పించాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం కోరారు. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి చేయాలని గురువారం బీజేపీ రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్యను బీసీ భవన్‌లో కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. 33 శాతం సీట్లలో బీసీ మహిళలకు రిజర్వేషన్లు కల్పించకపోతే, బీసీ మహిళలకు అన్యాయం జరుగుతుందన్నారు. అగ్రవర్ణ మహిళలకు ఉన్న రాజకీయ పలుకుబడి, ఆర్థిక శక్తుల అండ, బీసీ మహిళలకు లేవని ఈ నేపథ్యంలోనే మహిళలకు కేటాయించే సీట్లలోనూ రిజర్వేషన్లను అమలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. బడుగు, బలహీన వర్గాల మహిళల సాధికారతకు ప్రాధాన్యతను ఇచ్చే బీజేపీ పార్టీ, జాతీయ స్థాయిలో ఈ అంశంపై ఓ స్టాండ్ తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

అలరించిన 'శివోహం'

గన్‌ఫౌండ్రీ: స్వరభారతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురువారం రాత్రి బషీర్‌బాగ్‌లోని ఆలయంలో శివోహం–2025 పేరిట ఏర్పాటు చేసిన సంగీత నృత్య ప్రదర్శన ఆహుతులను ఆకట్టుకుంది. సుమారు 8 గంటల పాటు వివిధ అంశాలపై సాగిన నృత్య ప్రదర్శనలు ఆహుతులను అలరించాయి. కూచిపూడి, భరతనాట్యం, కర్ణాటక, హిందుస్థాని గాత్ర కచేరి, వయోలిన్, కీ బోర్డ్, ఫ్లూట్ విద్యార్థుల ప్రదర్శనలు ఆకర్షణీయంగా నిలిచాయి.

వేసవిలో నీటి ఎద్దడి ఉండదు

- ఫైప్‌లైన్‌లను ఆధునీకరించాం
- సుమారు రూ.కోటి నిధులు కేటాయించాం
- మా పరిధిలో ఒక్క రిజర్వాయర్ లేదు





బోర్డ్స్ క్లబ్ జలమండలి డీజీఎం కార్తీక్‌రెడ్డి

కవాడిగూడ: ముషీరాబాద్ సర్కిల్ పరిధిలోని పలు కాలనీల్లో రోజు విడిచి రోజు తాగునీటి సరఫరా ఉన్నప్పటికీ అనేక బస్తీలు, కాలనీలలో లో–ప్రెషర్‌తో తాగునీరు సరఫరా అవుతుండడంతో నీరు సరిపోక అనేక ఇబ్బందులు పడుతున్నారు. స్థానికులు ఎమ్మెల్యేకు, స్థానిక కార్పొరేటర్లకు, జీహెచ్ఎంసీ ప్రజావాణిలో ఫిర్యాదు చేస్తున్నారు. సర్కిల్ పరిధిలోని నీటి సమస్యలను బోర్డ్స్ క్లబ్ జలమండలి డీజీఎం కార్తీరెడ్డి దృష్టికి 'సాక్షి'తీసుకెళ్లింది. ఆయనతో జరిగిన ముఖాముఖిలో పలు అంశాలను వెల్లడించారు.

ప్రశ్న: సర్కిల్ పరిధిలోని పలు కాలనీలు, బస్తీలలో తాగునీటి సరఫరా సక్రమంగా ఉండటంలేదని ఎక్కువ సంఖ్యలో ఫిర్యాదుల వస్తున్నాయి.?

జవాబు: రోడ్డు నిర్మాణ పనులు, గోదావరి పైప్ లైన్ మరమ్మతుల కారణంగా కొన్ని కాలనీలు, బస్తీలలో తక్కువ సమయం సరఫరా చేయాల్సి వచ్చేది. అలాంటి సందర్భాల్లో ట్యాంకర్ల ద్వారా ఉచిత తాగు నీటి సరఫరా చేశాం. ప్రస్తుతం ఎలాంటి ఇబ్బంది లేకుండా నీటి సరఫరా చేస్తున్నాం. విద్యుత్ సరఫరాలో అంతరాయం కలిగిన సందర్భాలలో కొంతమేర జాప్యం జరుగుతోంది.

ప్రశ్న: ప్రస్తుతం నీటి ట్యాంకర్లు ఎన్ని ఉన్నాయి. వాటిని బుక్ చేసుకోవడం ఎలా.?

జవాబు: డివిజన్ పరిధిలో 5వేల లీటర్ల కెపాసిటీ గల ట్యాంకర్లు మూడు ఉన్నాయి. ట్యాంకర్ బుకింగ్ కోసం 155313 నంబర్‌కు క్యాన్ నంబర్ ద్వారా బుక్ చేసుకోవచ్చు.

ప్రశ్న: వేసవి ప్రారంభం అయినందున రోజుకు ఎన్ని ట్యాంకర్లు బుక్ అవుతున్నాయి.?

జవాబు: జనవరి నుంచే వేసవి ప్రారంభమైంది. ప్రస్తుతం ఒక్క రోజుకు 40 నీటి ట్యాంకర్లు బుక్ అవుతున్నాయి. అవి రానున్న రోజుల్లో 80 నుంచి 100కు పెరిగే అవకాశం ఉంది.

ప్రశ్న: కలుషిత నీటి సరఫరా రాకుండా ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు. ?

జవాబు: డ్రైనేజీ ఓవర్‌ఫ్లో కాకుండా జీహెచ్ఎంసీ సిబ్బందితో సమన్వయం చేసుకుంటూ ఎప్పటికప్పుడు మరమ్మతులు చేస్తున్నాం. ఎక్కడైనా లీకేజీ సమస్యలు ఉంటే మా దృష్టికి తీసుకువస్తే తక్షణమే పరిష్కరిస్తాం.

ప్రశ్న: మీకు స్థానికులు ఫిర్యాదు చేయాలంటే ఎలా.?

జవాబు: సమీపంలోని వాటర్‌వర్క్స్ కార్యాలయానికి వచ్చి మా మేనేజర్లను స్వయంగా కలువవచ్చు. లో–ప్రెషర్, లీకేజీలు, పొల్యూటెడ్ వాటర్, మీటర్ రీడింగ్‌లో తప్పులు, ట్యాంకర్ బుకింగ్ తదితర సమస్యలపై 155313 నంబర్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయవచ్చు.

ప్రశ్న: బోర్డ్స్ క్లబ్ పరిధిలో ఎన్ని రిజర్వాయర్లు ఉన్నాయి.?

జవాబు: మా పరిధిలో మూడు డివిజన్లు(కవాడిగూడ, గాంధీనగర్, భోలక్‌పూర్) ఉన్నాయి. ఇక్కడ ఒక్క రిజర్వాయర్ కూడా లేదు. ఆసిఫ్‌నగర్, నారాయణగూడ, ముషీరాబాద్ తదితర రిజర్వాయర్ల ద్వారా నీటి సరఫరా అవుతోంది. ఈ విషయంలో అక్కడి అధికారులతో సమన్వయం చేసుకోవడంలో కొంత మేర ఇబ్బందులు ఉన్నాయి.

ప్రశ్న: ఎగువ ప్రాంతాల వారికి నీటి సరఫరా చేయడానికి ఎలాంటి చర్యలు తీసుకున్నారు.?

జవాబు: ఎగువ ప్రాంతాల వారికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా నీటి సరఫరా చేయడానికి ఇప్పటికే మూడు బూస్టర్లు ఏర్పాటు చేశాం.

ప్రశ్న: వినియోగదారులకు మీరు ఇచ్చే సలహా.?

జవాబు: హైదరాబాద్ నగర ప్రజల దాహార్తి తీర్చడానికి ప్రభుత్వం తాగునీటి సరఫరాపై ప్రత్యేక దృష్టి పెట్టి అధిక నిధులు కేటాయిస్తోంది. వినియోగదారులు తాగునీటిని వృధా చేయొద్దు. మ్యాన్‌హోల్స్ పొంగుతుంటే మా దృష్టికి తీసుకొస్తే తక్షణమే చర్యలు తీసుకుంటాం.

రైతుల సంక్షేమాన్ని విస్మరించడం బాధాకరం

తెలంగాణ రైతు సంఘం కార్యదర్శి సాగర్



ఓంకార్ భవన్‌లో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న సాగర్

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: మానవ మనుగడకు.. దేశ అభ్యున్నతికి జీవనాధారమైన దేశీయ వ్యవసాయ రంగాన్ని నిర్వీర్యం చేస్తూ బడ్జెట్‌లో తగిన నిధులు కేటాయించకుండా కార్పొరేట్ వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తూ రైతుల సంక్షేమాన్ని విస్మరించడం అత్యంత బాధాకరమని తెలంగాణ రైతు సంఘం కార్యదర్శి టి.సాగర్ అన్నారు. గురువారం బాగ్‌లింగంపల్లిలోని ఓంకార్ భవన్‌లో అఖిల భారత రైతు సమాఖ్య, అఖిల భారత వ్యవసాయ సమాఖ్య ఆధ్వర్యంలో సమావేశం జరిగింది.

◆ ఈ సందర్భంగా సాగర్ మాట్లాడుతూ... రైతుల వ్యవసాయాన్ని ప్రోత్సహించేందుకు కేంద్ర రాష్ట్ర బడ్జెట్‌లో కనీసం 20శాతం నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. నూటికి 70శాతం మంది ప్రజలు వ్యవసాయ రంగంపై ఆధారపడి జీవిస్తున్నప్పటికీ ప్రభుత్వాలు వ్యవసాయ రంగ అభివృద్ధికి కృషి చేయకపోవడం బాధాకరం అన్నారు. రైతుల భూములను కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టే విధంగా చట్టాలు రూపొందించేందుకు కుట్రలు చేస్తున్నారని విమర్శించారు. దేశీయ రైతుల వ్యవసాయానికి ప్రోత్సాహకాలు ప్రకటించకుండా కార్పొరేట్ వ్యవసాయాన్ని ప్రోత్సహించే విధంగా రాయితీలు, సబ్సిడీలు మాఫీ చేస్తున్నారని అన్నారు.

◆ ఈ క్రమంలో రైతుల ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయి ఆత్మహత్యలు చేసుకుంటున్నారని తెలిపారు. దీంతో వారి కుటుంబాలు దిక్కులేని స్థితిలో ఉంటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐకేఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెద్దారపు రమేష్, ఏఐకేఎంఎస్ కార్యదర్శి మండల వెంకన్న, రైతాంగ సమితి అధ్యక్షుడు జక్కుల వెంకటయ్య, వివిధ సంఘాల నాయకులు కాంతయ్య, గోనే కుమారస్వామి, బుర్రి ప్రసాద్, తదితరులు పాల్గొని ప్రసంగించారు.



కాచిగూడలోని బ్రహ్మకుమారీస్ కార్యాలయంలో శివుడి జెండా ఎగురవేస్తునన బ్రహ్మకుమారీలు

రాజయోగ అభ్యాసం చేయాలి

కాచిగూడ: శివరాత్రి పండుగను పురస్కరించుకుని బ్రహ్మకుమారీస్ కాచిగూడ శాఖలో గురువారం శివుడి జెండాను ఎగురవేశారు. శివ పరమాత్మడి జెండా విశ్వంలో శాంతి పతాకాన్ని ఎగురవేస్తుందని శాఖ సంచాలకురాలు ప్రశాంతి అక్కయ్య తెలిపారు. నిరాకారుడైన శివ పరమాత్మ ఇచ్చిన జ్ఞాన బోధనలను గుర్తు చేసుకుంటూ వారి స్మరణలో జీవితాంతం గడపడమే ఉపవాసం (ఉప అనగా దగ్గరగా, వాసం అంటే నివసించుట) అని అన్నారు. అజ్ఞాన నిద్ర నుంచి మేలుకోవడమే నిజమైన జాగరణ అని అన్నారు. అందుకోసం శివ పరమాత్మ నేర్పించిన రాజయోగ అభ్యాసం చేయాలన్నారు. ఈ సందర్భంగా భక్తులు శివుడిని భక్తిశ్రద్ధంలతో ఆరాధించి, ధ్యానం చేశారు.ఈ కార్యక్రమంలో రూపా దీదీ, అఖిల దీదీ, పద్మశాలి సంఘం కాచిగూడ అధ్యక్షుడు శ్రీకాంత్ నేత తదితరులు పాల్గొన్నారు.

వీడలేమంటూ.. వీడ్కోలంటూ.!



సుందరయ్యవిజ్ఞానకేంద్రం: విద్యార్థులు కలసిమెలిసి స్నేహపూర్వకంగా ఉండాలని రెడ్ కాన్వెంట్ హైస్కూల్ రాంనగర్ కరస్పాండెంట్ కమటం రఘు అన్నారు. సబ్జెక్ట్ పరంగా కూడా గ్రూప్ డిస్కషన్ చేస్తే మంచి ఫలితాలు వస్తాయన్నారు. గురువారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో 10వ తరగతి విద్యార్థుల ఫేర్‌వెల్ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా రఘు మాట్లాడుతూ.. బాగా చదువుకుని తల్లిదండ్రులు, పాఠశాలకు మంచి గుర్తింపు తీసుకురావాలని కోరారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఆధునిక, సంప్రదాయ నృత్యాలతో అదరహో అనిపించారు. ఈ కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపాల్ కమటం సౌజన్య, టీచర్స్ అరుణ, కవిత, రాజేశ్వరి, అనిత, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

మసీదుల వద్ద ఇబ్బందులు తలెత్తకుండా చూడాలి



దాయార మార్కెట్‌లో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న యువజన కాంగ్రెస్ కమిటీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.అరవింద్‌కుమార్‌యాదవ్

ముషీరాబాద్: రంజాన్ మాసంలో మసీదుల వద్ద ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని యువజన కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శి అరవింద్‌కుమార్ యాదవ్ అన్నారు. గురువారం ముషీరాబాద్‌లోని ఐషా ఫంక్షన్‌హాల్‌లో ముషీరాబాద్ నియోజకవర్గం మైనార్టీ కమిటీ అధ్యక్షుడు డాక్టర్ మినాజుద్దీన్ అహ్మద్ ఆధ్వర్యంలో జీహెచ్ఎంసీ, జలమండలి, విద్యుత్ శాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన అరవింద్‌కుమార్‌యాదవ్ మాట్లాడుతూ.. పవిత్ర రంజాన్ మాసంలో మసీదుల వద్ద పారిశుద్ధ్య సమస్య, నీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలన్నారు. నియోజకవర్గంలోని 36 ప్రధాన మసీదులలో ఎలాంటి ఇబ్బందులు ఉన్నా తన దృష్టికి తీసుకొస్తే వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు.

◆ జీహెచ్ఎంసీ సర్కిల్–15 ఏఎంఓహెచ్ డాక్టర్ ప్రవీణ మాట్లాడుతూ.. రంజాన్ మాసం సందర్భంగా మసీదుల వద్ద స్పెషల్ డ్రైవ్ కార్యక్రమాన్ని చేపట్టామని పేర్కొన్నారు. చెత్త సేకరించే బ్యాగులను మసీదుల వద్ద అవసరమైనన్ని పంపిణీ చేసేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. ఈ సందర్భంగా అతిథులను డాక్టర్ మినాజుద్దీన్ శాలువాలతో సన్మానించారు. ఈ సమావేశంలో మాజీ కార్పొరేటర్ వాజీద్ హుస్సేన్, సికింద్రాబాద్ జిల్లా మైనార్టీ కమిటీ అధ్యక్షుడు మోసిన్‌కురేషీ, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు సయ్యద్ మోహిన్, మసూద్, నాయకులు జహీరుద్దీన్, అల్లావుద్దీన్, మహ్మద్ అఫ్రోజ్ తదితరులు పాల్గొన్నారు.

బ్యాగ్ చోరీపై జీరో ఎఫ్ఐఆర్

కాచిగూడ: రైల్లో బంగారు అభరణాలు, ల్యాప్‌టాప్, సెల్‌ఫోన్, నగదు ఉన్న బ్యాగ్ చోరీపై కాచిగూడ రైల్వే పోలీసులు జీరో ఎఫ్ఐఆర్ కేసు నమోదు చేశారు. రైల్వే ఇన్‌స్పెక్టర్ ఆర్.ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం... మధ్యప్రదేశ్ ఉజ్జయినికి చెందిన శ్వేత శర్మ బుధవారం బికనేర్ – కాచిగూడ ఎక్స్‌ప్రెస్ రైలులో నగరానికి కుటుంబ సభ్యులతో కలిసి వస్తోంది. రైలు ముత్కేడ్ జంక్షన్ వద్ద ఉండగా 25గ్రాముల మంగళసూత్రం, ఉంగరం, ల్యాప్‌టాప్, ఫోన్, రూ.6వేల నగదు ఉన్న బ్యాగు చోరీకి గురైంది. గురువారం బాధితురాలి ఫిర్యాదు మేరకు రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి నాందేడ్ రైల్వే పోలీస్‌స్టేషన్‌కు బదిలీ చేశారు.

రైలు ఢీకొని ఇద్దరు వ్యక్తులు మృతి

కాచిగూడ: రెండు వేర్వేరు సంఘటనల్లో గుర్తుతెలియని ఇద్దరు వ్యక్తులు మృతి చెందిన సంఘటన కాచిగూడ రైల్వే పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. రైల్వే ఇన్‌స్పెక్టర్ ఆర్.ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం... ఉప్పుగూడ – యాకుత్‌పుర రైల్వేస్టేషన్ల మధ్య గుర్తుతెలియని వ్యక్తి (55) పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొని మృతి చెందాడు. అలాగే బుద్వేల్ – శివరాంపల్లి రైల్వే స్టేషన్ల మధ్య గుర్తుతెలియని వ్యక్తి (60) పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొని మృతి చెందాడు. వీరి మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించారు. రైల్వే హెడ్ కానిస్టేబుల్ సమ్మయ్య కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆకట్టుకున్న 'చరణదాసు'



గన్‌ఫౌండ్రీ: ప్రముఖ నాటక రంగ సంస్థ రసరంజని ఆధ్వర్యంలో చరణదాసు అనే జానపద నాటకాన్ని గురువారం రవీంద్రభారతిలో ప్రదర్శించారు. మంచి చెడు కలగలిసిన దొంగ స్వభావాన్ని కళ్లకు కట్టినట్లు ప్రదర్శించిన తీరు ఆహుతులను ఎంతగానో ఆకట్టుకుంది. భూమిక థియేటర్ గ్రూప్ సమర్పణలో సాగిన ఈ నాటకానికి ఉదయభాను దర్శకత్వం వహించారు. ఈ కార్యక్రమంలో రసరంజని సంస్థ సభ్యులు సేనాపతి, నట్రాజ్, కామేశ్వర్‌రావు, కోటేశ్వర్‌రావు తపాల్గొన్నారు.

భక్తిగీతాల విభావరి



భక్తిగీతాలు ఆలపిస్తున్న గాయని రాజులదేవి జ్యోతి

చిక్కడపల్లి: జ్యోతి ఆర్ట్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శివరాత్రిని పురస్కరించుకుని గురువారం రాత్రి త్యాగరాయ గానసభలో 'భవహరణ శుభ చరణ'శీర్షికతో భక్తిగీతాల విభావరి నిర్వహించారు. ప్రముఖ గాయని రాజులదేవి జ్యోతి నిర్వహణలో గాయనీగాయకులు భక్తిగీతాలను ఆలపించారు. ఈ కార్యక్రమంలో పీవీఎస్ఎస్ శర్మ, అలూరి విల్సన్, శ్రీనివాసనాయుడు, కాశీవిశ్వనాథ్, లక్ష్మణ్, చంద్రశేఖర్, అనురాధ, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

చంద్రశేఖర్ ఆజాద్‌కు ఘన నివాళి



హిమాయత్‌నగర్‌లో నివాళులర్పిస్తున్న ఏఐవైఎఫ్ నేతలు

కాచిగూడ: చంద్రశేఖర్ ఆజాద్ పోరాట స్ఫూర్తిని నేటి యువత పుణికిపుచ్చుకోవాలని ఏఐవైఎఫ్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి కల్లూరు ధర్మేంద్ర అన్నారు. చంద్రశేఖర్ ఆజాద్ వర్ధంతి సందర్భంగా ఏఐవైఎఫ్ హైదరాబాద్ జిల్లా సమితి ఆధ్వర్యంలో గురువారం హిమాయత్‌నగర్‌లో అజాద్ చంద్రశేఖర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నెర్లకంటి శ్రీకాంత్, టి.సత్యప్రసాద్, షేక్ మహమూద్, కల్యాణ్, అనిల్ కుమార్, వంశీ, బాలు, విజయ్, అరుణ్, లక్ష్మణ్, శరత్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

లిబర్టీ: బ్రిటీష్ సామ్రాజ్య వాదుల నుంచి దేశాన్ని విముక్తి చేయడానికి సాగిన స్వాతంత్ర పోరాటంలో చంద్రశేఖర్ ఆజాద్ నిర్వహించిన పాత్ర మరువలేనిదని లోక్‌దళ్ పార్టీ తెలంగాణ రాష్ట్ర శాఖ అధ్యక్షుడు పి.వి.రాజేశ్వరరావు అన్నారు. చంద్రశేఖర్ ఆజాద్ వర్ధంతి పురస్కరించుకొని దళ్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సభలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. స్వాతంత్ర పోరాటంలో వేత్తన ఎగిసిన కెరటం చంద్రశేఖర్ ఆజాద్ అని కొనియాడారు. అనంతరం చంద్రశేఖర్ ఆజాద్‌కు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పి.వి.శ్రీనివాసరావు, సౌభాగ్యవతి తదితరులు పాల్గొన్నారు.

'ప్రపంచ అందాల పోటీలను అడ్డుకుంటాం'

కాచిగూడ: హైదరాబాద్ వేదికంగా అంగాంగ ప్రదర్శనగా సాగే 72వ ప్రపంచ అందాల పోటీలను అడ్డుకుంటామని ప్రగతిశీల మహిళా సంఘం జాతీయ నాయకురాలు వి.సంధ్య హెచ్చరించారు. పీఓడబ్ల్యూ రాష్ట్ర అధ్యక్షురాలు జి.అనసూయ అధ్యక్షతన గురువారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో జాతీయ నాయకురాలు జి.ఝాన్సీతో కలిసి సంధ్య మాట్లాడారు. ఒకవైపు నీటి కరువుతో సాగునీరు, తాగునీరు లేక పంటలు, గొంతులు ఎండి ప్రజలు అల్లాడుతుంటే ప్రపంచ సుందరి పోటీలకు హైదరాబాద్‌ను వేదికగా మార్చడం ప్రభుత్వానికి ప్రజలపై ఉన్న బాధ్యతారాహిత్యాన్ని తెలియజేస్తుందని ఆమె అన్నారు. ఆత్మహత్యలు, ఆకలి చావుల సూచీలో మొదటి, రెండో వరుసలో ఉన్న ఈ దేశంలో అందాల పోటీలు ఎవరికోసమని ఆమె ప్రశ్నించారు. మన దేశ సంస్కృతి, సంప్రదాయాలకు వ్యతిరేకంగా జరిగే అందాల పోటీలను ప్రతి ఒక్కరూ అడ్డుకోవాలని ఆమె పిలుపునిచ్చారు. సామాజిక, ఆర్థిక, రాజకీయ సమానత్వం కోసం పోరాడాలని అన్నారు. మహిళలపై జరుగుతున్న హింసను వ్యతిరేకిస్తూ మార్చి 8న అంతర్జాతీయ శ్రామిక మహిళా పోరాట దినోత్సవాన్ని జరుపుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రగతిశీల మహిళా సంఘం (పీఓడబ్ల్యూ) ప్రతినిధులు ఆర్.సీత, జి.భారతి, వై.గీత, టి.ప్రేమలత తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పీఓడబ్ల్యు జాతీయ నాయకురాలు సంధ్య

కమనీయం గిరిజా కల్యాణం

భక్తులతో పోటెత్తిన శంకరమఠం





శంకరమఠం ప్రాంగణంలో గిరిజా కల్యాణం నిర్వహిస్తున్న పండితులు, కల్యాణ వేడుకలను తిలకిస్తున్న భక్తులు



బాగ్అంబర్‌పేటలోని శివాలయంలో కార్పొరేటర్ పద్మా వెంకటరెడ్డి దంపతులు

నల్లకుంట: మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని నల్లకుంటలోని శంకరమఠం భక్తులతో పోటెత్తింది. గురువారం ఉదయం మఠం ప్రాంగణంలో శక్తి గణపతికి తొలిపూజలు కావించిన అర్చకస్వాములు, చంద్రమౌళీశ్వర స్వామి, శారదాంబకు విశేష పూజలు చేశారు. అనంతరం అక్కడి ప్రాంగణంలో పురోహితులు, వేదపండితుల వేద మంత్రోచ్ఛరణల నడమ గిరిజా కల్యాణం నిర్వహించారు. ఆది దంపతుల కల్యాణాన్ని కనులార తిలగించేందుకు నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలి వచ్చారు. ఈ సందర్భంగా మధ్యాహ్నం భక్తులకు భోజన వితరణ కావించారు.

భక్తిశ్రద్ధలతో శివరాత్రి జాగరణ

అంబర్‌పేట: మహా శివరాత్రి జాగరణను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గురువారం తెల్లవారుజాము వరకు జరిగిన జాగరణలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. మధ్యాహ్నం పూజలు చేసి ఉపవాస దీక్షలు విరమించారు.

అన్నం పరబ్రహ్మ స్వరూపం

కాచిగూడ: అన్నం పరబ్రహ్మ స్వరూపమని వీరభద్ర సేవా సమితి హైదరాబాద్ అధ్యక్షుడు షాబాద్ వెంకటేశం, ప్రధానకార్యదర్శి కాలసు వినోద్ అన్నారు. మహా శివరాత్రి సందర్భంగా గురువారం కురవి వీరభద్రస్వామి ఆలయంలో భక్తులకు అన్నదానం చేశారు. కులమతాలకు అతీతంగా పండుగలను జరుపుకుంటున్న ప్రజలకు వారు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త కాసుల మల్లికార్జున్, సమితి సభ్యులు విజయ్ పటేల్, కొండూరు వినోద్, ఆనంద్, శోభారాణి, దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

లింగోద్భవ పూజలు

ముషీరాబాద్: భోలక్‌పూర్ డివిజన్ పద్మశాలికాలనీలోని ప్రసిద్ధిగాంచిన సంజీవ హనుమాన్ దేవాలయంలో స్వామివారికి లింగోద్భవ పూజలు నిర్వహించారు. భక్తులు పెద్ద ఎత్తున హాజరై స్వామివారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు సీతా మార్కండేయ, పుండరీకం, సంయుక్త కార్యదర్శి వినోద్, మాజీ చైర్మన్ కృష్ణమూర్తి, ఆర్.ఆంజనేయులు పాల్గొన్నారు.



వీరభద్ర సేవా సమితి హైదరాబాద్ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేస్తున్న ప్రతినిధులు

ముషీరాబాద్: మహాశివరాత్రిని పురస్కరించుకొని భోలక్‌పూర్ డివిజన్ దేవునితోటలోని భవానీశంకర ఆలయాన్ని నగర పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన ప్రత్యేక పూజలు చేసి స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సిబ్బంది సురేష్ కుమార్, ఆర్.శ్రీనివాస్ సీపీ సన్మానించి తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయంలో చేపడుతున్న పూజా కార్యక్రమాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో చిక్కడపల్లి ఏసీపీ రమేష్ కుమార్, ముషీరాబాద్ సీఐ రాంబాబు పాల్గొన్నారు.